# స్వీట్ నథింగ్స్

-కిరణ్‌బాల

బస్‌దిగి తిన్నగా ఇందిరాపార్క్ గేటువైపు నడిచాను. గేట్‌దగ్గరే కాపలాదారులా నిలబడ్డాడు విష్ణు.

నా కెదురుగ్గా వచ్చి.'వచ్చావా, టికెట్ తీసుకున్నా పద!' అంటూ అవతలికి దారితీశాడు.



జనానికి దూరంగా ఓ మంచి ప్లేస్ చూసుకుని కూర్చోవాలని ఆలోచిస్తున్నాడేమో చుట్టూ దృష్టిసారిస్తూ నడుస్తున్నాడు.

'ఇంతాలస్యమైందేం?' విష్ణు ప్రశ్నించాడు.

'బస్ దొరకలేదు' అని జవాబిచ్చి, 'ఆ పక్కన కూర్చుందామా' అంటూ వెళ్ళి కూర్చున్నాను.

విష్ణుకూడా వచ్చి పక్కనే కూర్చుంటూ-

'అన్ని బస్‌లొచ్చాయి కదా! బస్ దొరకలేదంటావేంటీ?' అడిగాడు.

'అంటే.... నేనబద్ధం చెప్తున్నాననా నీ ఉద్దేశ్యం?... నేనెక్కే స్టేజ్ దగ్గర బస్‌లు ఆపితే కదా!' కాస్తకోపంగా అన్నాను.

'గంటన్నర నుండీ ఎదురుచూస్తున్నాను తెల్సా?' తనూ కోపం తెచ్చుకుని అన్నాడు.

'నేనూ గంటనుండీ బస్‌కోసం వెయిట్‌చేసీ చేసీ... చివరికి ఆటోలో వచ్చేద్దామనుకునే సమయంలో... వచ్చి ఆగింది బస్. ఎంత జనం - ఎంత తొక్కిసలాట! ఎంతో కష్టపడి వచ్చాను. బస్‌కోసం ఎదురుచూట్టం పరమబోర్! పైగా ప్రతీ బస్సూ కిక్కిరిసిన జనంతో రావటం - ఒక్కటీ ఆగకుండా పోవటం!' చిరాగ్గా చెప్పాను.

'ఆగిన ప్రతిబస్సులోనూ నీకోసం వెతుక్కోటం నాక్కూడా బోర్ కొట్టింది' అన్నాడు విష్ణు.

నాకొళ్ళు మండింది.

'అంటే నేను బస్‌కోసం ఎదురుచూట్టానికీనూ... నువ్వు నాకోసం ఎదురుచూట్టానికీనూ... పెద్దతేడా లేదంటావ్! పోనీ నేనంటే గంటలేట్‌గా వచ్చాను సరే, నువ్వెందుకు అనుకున్న టైమ్‌కంటే అరగంట ముందే తగలడ్డావ్?' అన్నాను.

"అబ్బ! వచ్చీరావటంతోనే ఎందుకలా పోట్లాటకి దిగుతావ్. ఛీ మూడంతా పాడయిపోయింది.'

అసలే చీకాకుగా ఉన్న నాకు విష్ణు మాటలకి మరీ చికాకు కలిగింది.

'అయితే ఎవరింటికి వ్యాళ్ళు వెళ్ళిపోదామా?' కోపంగా అన్నాను.

'అబ్బో... సత్యభామలా ముక్కుమీదే ఉంటుంది కోపం!... పోనీగానీ మనమొచ్చింది పోట్లాడుకోవటానకి కాదు కాబట్టి కమ్మటి కబుర్లు చెప్పుకుందాం!' అన్నాడు విష్ణు రిలాక్స్ అవుతూ...

'సరే చెప్పు' అన్నాను ముడుచుకున్న కాళ్ళని ముందుకి చాపుకుంటూ..

విష్ణు నాకెదురుగ్గా ఇంకాస్త ముందుకి జరిగికూర్చుని ముఖంలో ముఖం పెట్టి చూస్తూ...

కొన్ని సెకన్ల తర్వాత-

'నీ కళ్ళలో పుట్టుమచ్చలున్నాయ్!' అన్నాడు ఆర్కిమిడీస్ 'యురేకా' అన్నంత సంబరంగా.

నాకు కాస్త మనసు తేలిక పడుతోంది అనుకునే సమయంలోనే విష్ణు చచ్చుమాటతో గాలితీసిన బెలూన్లా ఉసూరుమంది.

'ఇంకా చెప్పు' తాపీగా అన్నాను.

"నీ కళ్ళు ఆల్చిప్పల్లా ఉన్నాయ్."

'ఇంకా!!' రెట్టించాను.

"నీ ముక్కేమో... అఁ! నీ ముక్కు రంధ్రాలు చాలా చిన్నగా వుంటాయి. నీ ముక్కు ఇంకొంచెం పొడుగ్గా ఉంటే అచ్చం మాధురీదీక్షిత్ ముక్కులా ఉండేది. అయినా... సంపెంగి పువ్వులా ఉందనుకో!"

గొప్ప గొప్ప రహస్యాల్ని కనిపెట్టిన సైంటిస్ట్‌లా ఉత్సాహంగా విష్ణు చెప్పుకుపోతోంటే నాకెంత కోపం వచ్చినా... కాస్సేపు ఆటపట్టించాలన్న సరదా పుట్టింది.

"నా కళ్ళెలా ఉన్నాయన్నావ్?" అడిగాను.

"ఆల్చిప్పల్లా" గడ్డిలోకి ఒరిగి పడుకుంటూ అన్నాడు.

"ఆల్చిప్పల్లా ఉన్నాయా? కప్పకడుపుల్లా లేవా?" వ్యంగ్యంగా అన్నాడు. "ఇదేం పోలిక?!" ఆశ్చర్యపోయాడు.

"ముక్కెలా ఉందన్నావ్?" సహనంగా అడిగాను.

"సంపెంగి పువ్వులా" ఉత్సాహంగా ఠకీమని సమాధానం చెప్పాడు.

"ఆ పువ్వుపేరు వినటమేగానీ ఇంతవరకూ నేనూ చూళ్ళేదు. నువ్వైనా చూశావా? ఔటే?"

నా మాటల్లోని ఎగతాళిని గమనించినట్టులేడు. తన ధోరణి తనదే!

"నేనూ చూళ్ళేదనుకో" అని. జ్ఞాపకం చేసుకొని...

"ఆ! చూశాను ఓసారి. మా అక్కయ్యకి ఓ ఫ్రెండ్ తెచ్చిస్తే పెట్టుకుంది. కానీ సరిగా గుర్తులేదు."

"ఇలాంటి పోలికలు నీకెలా తెల్సాయి?"

పక్కనే ఉన్న గడ్డిపోచల్ని తెంపి చిన్న చిన్నతునకలు చేస్తూ అడిగాను.

"సాహిత్యం! సాహిత్యంలో గొప్ప గొప్ప పోలికలుంటాయ్!"

"ఓహో, ఎప్పుడూ వినని... చూడని పోలిక లుంటాయన్న మాట! నంది తిమ్మన ఏమన్నాడో తెల్సా?"

విష్ణు ఏ లోకాల్లోకో వెళ్లిపోతూన్నాడు.

'ఆ నంది తిమ్మన నీతో ఏమన్నాడో తెలీదుకానీ ఈ ముక్కుతిమ్మన 'ఏమన్నాడో తెల్సు!' అన్నాను వెటకారంగా.

"ఓహో...నీకూ సాహిత్యం తెల్సే! నందితిమ్మనని ముక్కు తిమ్మన అంటారు. ముక్కుమీద గొప్పగా కవిత్వం చెప్పాడు."

"నీ ముక్కూ... కవిత్వం... సాహిత్యం.. తగలెయ్యా ఎక్కడలేని సోది కబుర్లూ... సుత్తి కబుర్లే దొరికాయా నీకు?" అంటూ అప్పటి వరకు అదిమిపట్టుకున్న కోపాన్ని ఒక్కసారిగా వెళ్ళగక్కాను.

విష్ణు తనలోకం నుండి ఈలోకంలోకి వచ్చి పడ్డాడు. 'మరింకేం మాట్లాడమంటావ్?' అడిగాడు.

నేనేం మాట్లాడలేదు.

కొంచెం సేపయ్యాక అన్నాడు.

'అసలు సాహిత్యంలో చాలా మజా ఉంటుందోయ్!' మళ్ళీ అదే ధోరణి.

నాకు చెర్రెత్తు కొచ్చింది.

"వెనక్కి తిరిగి చూడకుండా... బస్‌కూడా ఎక్కకుండా... నేనింటికి పారిపోతాను." కోపంగా అన్నాను.

"ఎందుకంత కోపం? కూల్‌డ్రింక్ తాగుదామా!

"నాకేం వద్దు. కావాలంటే నువ్వేతాగు."

"ఈ కోపాలూ - తాపాలూ పెళ్ళైయ్యాక. ఇప్పుడు హాయిగా ఎంజాయ్ చెయ్యాలి తెల్సిందా!" అన్నాడు చిరునవ్వుతో.

'అంటే పెళ్ళయ్యాక పోట్లాడుకోవాలనా ఇతని ఉద్దేశ్యం?' అని నాలోనేను గొణుకున్నాను.

'ఏంటి గోణుక్కుంటున్నావ్?'

'నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటావా అని'

"తప్పకుండా నిన్నే పెళ్ళాడతా!" తమాషాగా అన్నాడు.

"పోవోమ్మ నువ్వు చేసుకుంటానన్నా, నే చేసుకోవద్దూ...!" ఉడికిస్తూ అన్నాను.

"నన్ను చేసుకోకపోతే ఎవర్ని చేసుకుంటావ్... దారిన పోయే దానయ్యనా?"

"దార్నపోయే దానయ్యనో... మూడుకాళ్ళ ముసలయ్యనో చేసుకుంటాను. నిన్ను మాత్రం చేసుకోను' నిక్కచ్చిగా చెప్పాను. 'ఎందుకనీ?' కొంచెం సీరియస్‌గా అడిగాడు.

"కమ్మటి కబుర్లంటే కళ్ళూ... ముక్కూ, ఆల్చిప్పలూ - కప్పలూ అనుకునే నిన్ను పెళ్ళిచేసుకుని నేనేం సుఖపడగల్ను.

"పోనీ... కమ్మటి కబుర్లంటే ఎట్లా వుంటాయో నువ్వు చెప్పు - వింటాను." ఓపిగ్గా అడిగాడు.

గడ్డిలోంచి లేచి మఠంవేసుకొని కూర్చున్నాడు.

'పెళ్ళి చేస్కోను అనే సరికల్లా రాజీకొచ్చాడు మగాడు' అను కున్నాను.


'చెప్పు' అన్నాడు మళ్ళీ బుద్ధిమంతుడిలా.

"చెప్పు... చెప్పు... అనగానే మాటలు పుట్టుకొచ్చేస్తాయా? మూడ్ రావాలికదా!"

"మూడూ లేరు... నాలుగూ లేదూ! ఏదో ఒకటి మాట్లాడు. నీ మాటలెలా ఉంటాయో విందాం!"

"విందాం ఏంటి? నా మాటలు నేనెట్లా వింటాను? నేను మాట్లాడితే నువ్వు వింటావ్. పెద్ద సాహిత్యాభిమాని అట! భాషే సరిగ్గా రాదు.' నవ్వుతూ వెక్కిరింతగా అన్నాను.

"నాకు తెలీక అడుగుతాను..."




పి. మమత, కేరాఫ్ పి. గంగారాం. హెచ్.నం. 9-4-154/1, గాజులపేట, నిజామాబాద్ - 1

అతణ్ణి మధ్యలో ఆపేస్తూ...

"తెలీకడిగినా, తెలిసి అడిగినా సాహిత్యం పేరెత్తకు. కచ్చుబుట్టి నీచెయ్యి కొరికేస్తాను."

విష్ణు చేతిని నాచేతిలోకి తీసుకుంటూ అన్నాను. ఆ చెయ్యి తాకగానే నాలో ఏదో అప్యాయత ఎదలోతుల్లోంచి పొంగుకొస్తుంది. మరి విష్ణుకెలా వుంటుందోగానీ...?

'ఏంటీ కొరకటానికి సిద్ధంగా ఉన్నావా?' నవ్వుతూ అన్నాడు మళ్ళీ వెంటనే.

"గత జన్మలో నువ్వు 'శునకిని'వై వుంటావ్" అన్నాడు.

"అంటే?' అండిగా అర్థంగాక.

"శునకమంటే కుక్క. 'శునకిని' అంటే ఆడకుక్క"!

"ఓహో. అయితే నువ్వు శునకినీ ప్రియుడవైన శునకానివయ్యుంటావ్. ఓ గజ్జికుక్కతో పోట్లాడుంటావ్. అది కొస్తా నిన్ను కరిస్తే...నీకు పిచ్చెక్కుంటుంది. అది... ఈ జన్మలో కూడా ఇంకా వదిల్నట్టులేదు."

నేనెంతో ఉడుక్కుంటూ కసిగా అన్నమాటలకి ప్రతిగా విష్ణు ఏమాత్రం ఉడుక్కోలేదు సరికదా... పకపకా నవ్వేస్తూ...

"గతజన్మ వైభవాలు కళ్ళముందుకనిపిస్తున్నాయ్!" అన్నాడు తన్మయాన్ని నటిస్తూ.

పక్కనుంచి ఓ నవ్వు వినిపించింది.

నేనూ, విష్ణు ఒక్కసారిగా అటువైపు చూశాం. మాక్కాస్త దూరంలో నలభైయ్యేదూ... యాభైయేళ్ళ మధ్యవయసున్న ఓ పెద్దమనిషి మమ్మల్ని చూసి నవ్వుతున్నాడు.

'ఏంటిసార్, నవ్వుతోంది మమ్మల్ని చూసేనా?' అడిగాడు విష్ణు.

"మిమ్మల్ని చూసికాదూ... మీ మాటలు వింటూంటే...' మళ్ళీ నవ్వాడాయన.

"మా మాటల్లో అంత నవ్వొచ్చే విషయమేముంది?' విష్ణు వింతగా అడిగాడు.

"గంటసేపట్నుంచీ చూస్తున్నాను. మీ పోట్లాట ఎంతకీ తెగదు. అసలు... ఒక్క నిమిషమన్నా తిన్నగా మాట్లాడుకున్నారా అని నా అనుమానం."

ఎవ్వరూలేని ప్రదేశం అని వెతుక్కున్నానేకానీ ఆ రాళ్ళ కుప్పచాటున పడుకున్న ఈయన్ని గమనించుకోలేదు 'మా సొదంతా విన్నాడు కాబోలు కర్మ! అనుకొని.

"ఎంతసేపైందండీ మీరిక్కడికొచ్చి?" అనడిగాను.

"మీ కంటే ముందుగానే ఇక్కడున్నాను తల్లీ! కాస్త విశ్రాంతికోసం ఇక్కడికొస్తే మీ పోట్లాట! బావుంది. చాలా బావుంది. కానీ ఎంతసేపూ పోట్లాడుకోటమేనా ఓ పదినిమిషాలు మామూలుగా మాట్లాడుకోండి చూద్దాం'

అయన మాటల్లో ఓ ఛాలెంజ్!

"విష్ణు, మనిద్దరం మంచి మిత్రుల్లా మాట్లాడుకుందాం. సరేనా!" అన్నాడు సీరియస్‌గా.

"సరేనా!" అన్నాను సీరియస్‌గా.

"నేను కాదన్నానా? నువ్వే చీటికీ మాటికీ కయ్యానికి కాల్దువ్వుతావ్. ప్రతిమాటికీ పెడర్థాలు తీస్తావ్!'

"నేను కయ్యానికి కాల్దువ్వుతానా? అసలు నువ్వే రెండర్థాలొచ్చే మాటలు మాట్లాడ్తావ్.. చూడూ! అనవసరంగా నన్నంటే వూర్కునేది లేదు" కోపంగా అన్నాను.

"రెండర్థాలంటే సినిమా పాటల్లాగానా? ఛీ. ఛీ! నేనట్లా ఎప్పుడూ మాట్లాడలేదు. నువ్వే లేని అర్థాలు వెతికి... పీకి.. నన్ను ఏకులు వడుకుతావ్!"

"ఎప్పుడూ ఇలా పోట్లాడ్డమే తప్ప, చక్కగా మాట్లాడ్డం రాదు." నాకు కోపంతోపాటూ దు:ఖంకూడా వచ్చింది.

ఆ పెద్దమనిషి వైపు తిరిగి అన్నాను.

"చూస్తున్నారుగా. ఇదీ వరస! ఈపాటి మగాడికోసమా నేనంత దూరం నుంచీ పడిగాపులుపడీ... వచ్చీవెడీ బస్లో వేళ్ళాడుతూ వచ్చింది? పైగా కండక్టర్తో గొడవపడ్డాను కూడా!"

"గొడవ పడ్డావా? ఈ సంగతి అప్పుడే ఎందుకు చెప్పలేదు?" ఆత్రంగా అడిగాడు విష్ణు.

"చెప్తే ఏంచేసేవాడివి? నాకేమన్నా గండపెండేరం బహూకరించేవాడివా? లేక గజారోహణం చేయించేవాడివా?"

విష్ణు నవ్వాడు.

"నీ నోటినుండి అలా మంచి భాషాపరిజ్ఞానపు మాటలు వస్తోంటే నిజంగా 'ఐ ఫీల్ సో హాపీ!' నిన్నంత గొప్పగా సత్కరించేంత స్థాయిలోలేను కానీ, ప్రస్తుతానికి ఈ గడ్డి పువ్వుని బహూకరిస్తున్నాను."

పక్కనే గడ్డిలోంచి ఓ చిన్నపువ్వు తెంపి స్టైల్‌గా చెయ్యి తిప్పి నా ముందుకి చాచాడు.

"సిగ్గులేదూ! పనికిమాలినవీ... తేరగా వచ్చేవీ బహుమతిగా ఇవ్వటానికి!" వెక్కిరింతగా అన్నాను.

"శ్రీ శ్రీ ఏమన్నాడు చిన్నారీ! 'హీనంగా చూడకు దేన్నీ కవితామయమేనోయ్ అన్నీ' అన్నాడు. అందుకే కళ్ళకద్దుకో ఈ గడ్డి పువ్వునీ!... ఈ పువ్వు పూసింది నీ కోసమే!" రాగంతీస్తూ అన్నాడు.

నాపేరు 'కవిత' అవటం అతని మాటల్లో కవితామయం అని రావడం యాదృచ్ఛికమైనా ఆ చమత్కారానికి నవ్వొచ్చింది. అయినా నవ్వకుండా ఆపుకున్నాను.

ఎందుకోగానీ విష్ణుని బాగా కవ్వించాలనిపిస్తుంది. అతడు మాత్రం తక్కువా? మాటకి మాట అప్పజెప్పి పోట్లాట సృష్టిస్తాడు.

అలా గంటలు గడియిపోయాక ఇంటికి వెళ్ళాల్సిన సమయంలో 'అయ్యో ఒక్క ప్రేమమాటకూడా మాట్లాడుకోలేదే' అని బాధపడ్తాం! ఇది మాకు రోజూ మామూలే!

నేనన్నాను "పైసా ఖర్చుకాకుండా. ఏమాత్రం ప్రయాసలేకుండా ఉచితంగా దొరికితే దేన్నైనా గ్రేట్‌గా దానం చేయవచ్చు."


"నేనిచ్చే కానుక నీకు దానంలా కనబడుతోందా?" సాగదీస్తూ అడిగాడు.

"అ! కాకపోతే తేడా అల్లాక కానుక' అడక్కముందే ఇస్తే 'దానం' అడిగితేనే ఇస్తారు."

"కాదు, కానుకలో హృదయముంటుంది."

"అంటే... ఈ గడ్డిపువ్వులో నీ హృదయముందంటావ్. సరే. ఏం జేస్తాం!"

అతడి చేతిలోంచి గడ్డిపువ్వుని నా చేతిలోకి తీసుకుని "ఓ గడ్డిపువ్వా! మా కోతి విష్ణు హృదయమా! నీదెంత




కె. చిన్నన్న, చిన్నమెట్‌పల్లి (పోస్ట్) - 505 453, కోరుట్ల (మం), కరీంనగర్ జిల్లా

విశాలహృదయమైనా ఇలా చీప్‌గా అందరికీ దొరక్కూడదు సుమా!" అన్నాను.

"ఎదురుగా చెట్టంత మనిషిని నేనుంటే దాంతో ఏం మాట్లాడ్తావ్?"

"నేను నీతో మాట్లాడటంలేదు. నీ హృదయంతో మాట్లాడుతున్నా!"

"అస్సలు కోతివి నువ్వు."

"అవున్లే, నేనే కోతిని! నిన్ను 'కోతి' అంటే కోతి- మరి ఇంత దిగారంగా ఉన్నావా అని కోతి బాధపడిపోదూ?

నా కవ్వింపు మాటలకి విష్ణు ఉడుక్కొని చెయ్యెత్తి నన్ను కొట్టబోయాడు. ఆ పెద్దమనిషి మా ఇద్దర్నీ వారిస్తూ.

"అగండాగండీ, మీరు మళ్ళీ పోట్లాడుకుంటున్నారు మాట తప్పారు" అన్నాడు.

మేమిద్దరం బుద్ధిగా సర్దుక్కూర్చుని ఏక కంఠంతో అన్నాం. "ఇప్పుడు చూడండీ, మంచి మాటలు మాట్లాడుకుంటాం"

"కదూ విష్ణూ!" అన్నాన్నేను.

"మరంతేకదా కవితా!" అన్నాడు విష్ణు.

"అయితే మాట్లాడు."

విష్ణు మళ్ళీ నా ముఖంలో ముఖం పెట్టి చూస్తూ కాస్సేపు ఆలోచించి-

"నీ కళ్ళు అల్చిప్పల్లా లేవు, నీ ముక్కు సంపెంగిలా లేదు. నీ పెదవులు..."

"చాల్చాలు! లేని దానికి పోలికలెందుకూ? పోచికోలు కబుర్లు కాకపోతే!" అన్నాను.

"ఎట్లా నీతో వేగేది? పోల్చి చెప్పినా తప్పే - చెప్పకపోయినా తప్పే! సరే, నువ్వు మాట్లాడు - నేను వింటాను" అన్నాడు చిరాకూ, బాధా కల్సినగొంతుతో.

"ఏం మాట్లాడాలి?" ఆలోచిస్తోన్నాను. విష్ణు కాళ్ళమీద నా దృష్టి పడింది బాటా చెప్పులేసుకున్నాడు.

"విష్ణూ! నీ చెప్పులు తెల్ళలా వున్నాయోయ్, నీచెయ్యేమో మరి... మరి క్రికెట్ బ్యాట్‌లా..."

విష్ణు వెంటనే... నేను కపిల్‌దేవ్‌లా లేనా మరి?" అడిగాడు.

"ఛీ! అంత అందమైన పెద్దకళ్ళూ, వొత్తైన మీసాలూ నీకెక్కడున్నాయ్?" కవ్వింతగా అన్నాను.

"అవునవును. అంత ఎత్తు పళ్ళు కూడా నాకులేవు' ' వొత్తి పలుకుతూ వ్యంగ్యంగా అన్నాడు.

"ఏయ్, మా కపిల్‌ని ఏమన్నా అన్నావంటే చూడూ... మర్యాదక్కదు!" చూపుడువేల్తో బెదిరిస్తూ, సీరియస్ నటిస్తూ అన్నాను.

"నువ్వు నన్నెన్ని మాటలన్నా అనొచ్చు... మర్యాదే! కానీ నేను మాత్రం కపిల్దేవ్‌ని ఒక్క మాటంటే నీక్కోపమా! అంటే నాకంటే ఆ కపిల్దేవే నీ కెక్కువయ్యాడన్నమాట"

విష్ణు మాటల్లో ఉడుకుమోత్తనం.

నాకేమో నవ్వొస్తోంది.

ఆ పెద్దమనిషి లేచి నిలబడి:

"తల్లీ! ఇలా మాట్లాడుకోటం మీకోసరదా కాబోలు, పిచ్చి ముండావాణ్ణి తియ్యగా మాట్లాడుకుంటారేమో చూద్దామనుకున్నాను. ఇంక మీ మాటలు విన్లేనుకానీ ప్రతిరోజూ ఇలాగే పోట్లాడుకుంటారా?" ఆసక్తిగా అడిగాడాయన.

"మేం పోట్లాడుకోవటమేంటి? మా మాటలే ఇలా ఉంటాయిసార్." అన్నాడు విష్ణు.

"ఇంతకంటే తీవ్రంగా కూడా చాలాసార్లు మాట్లాడుకున్నాం" అన్నాన్నేను.

"మళ్ళీ మర్చిపోతాం. విడిపోయే ముందు కవిత కళ్ళల్లో నీళ్ళూర్తాయి." విష్ణుబాధగా అన్నాడు.

"మళ్ళీ కన్నీళ్ళ విషయంలో ఓ ఐదునిమిషాలు పోట్లాడుకుంటాం." అన్నాన్నేను.

"మరి మధ్యవర్తిలేందే ఎలా కాంప్రమైజ్‌అవుతారు?"

"విష్ణు వీక్ పాయింట్ నాకు తెల్సు" అన్నాను కొంటెగా.

"నీ వీక్ పాయింట్‌కూడా నాకుతెల్సు" నవ్వుతూ అన్నాడు విష్ణు.

"అయితే అదేంటో చెప్పండి! వెళ్ళేముందు ఆ వింత విషయాన్నీ రహస్యాన్ని కూడా వినేపోతాను. నాకథకి పని కొస్తుంది."

"మీరు రైటరా సార్." ఆశ్చర్యంగా అన్నాడు విష్ణు. నోరెళ్ళబెట్టాను నేను.

"నేవెళ్ళాక ఆశ్చర్యపోదురుగానీ ముందా రహస్యం చెప్పండీ!" అన్నాడాయన ఆత్రంగా.

ఇద్దరమూ ఒకేసారి చెప్పాం.

"నేను నిన్ను పెళ్ళిచేసుకోను అంటే చాలు!" ★

## ఖర్చు



"మీరు మీ అవిడ నెలకోసారీ తిరుపతి వెళ్ళొస్తున్నారు. ఎందుకండీ?" ఆశ్చర్యంగా రామానందాన్ని అడిగాడు చిదంబరం.

"రోజూ మా అవిడ పెట్టే హేర్ ఆయిల్ల ఖర్చు భరించలేక" వినయంగా చెప్పాడు రామానందం.


-కెంచు చిన్నన్న, చిన్నమెట్‌పల్లి,
మేడిపల్లి (వయా)
కరీంనగర్ జిల్లా - 505 453.

## తాజ్‌మహల్

ఇద్దరు తాగుబోతులు తాజ్‌మహల్ ఎదరుగా వస్తుంటారు. వారిద్దరు తాజ్‌మహల్ చాలా క్రింద ఉందనుకొని ఒంగి ఒంగి వెళ్తుంటారు.

ఆ వంగిన వాళ్ళను చూచి, పోలీస్ పెల్‌మని వీపువాయించారు వారిద్దరు. అప్పుడు తాజ్‌మహల్ ఇంత వంగినా తగిలింది చూడరా అనుకుంటారు.

-ఎమ్. గంగిరెడ్డి, బ్రాహ్మణపల్లి,
పులివెందుల, కడపజిల్లా



ఎ. సరోజ, 12-70-411/8, సికింద్రాబాద్ - 61